"తినేశాను.... అక్కర్లేదు."

ఆ వృద్ధుడు విస్మయంగా చూస్తూ "అదేం" అన్నాడు.

"మరేమో ఆకలేయకుండా అమ్మ ఆకలిపాట నేర్పింది . అది పాడుకుంటే చాలు ఆకలి ఆగిపోతుందన్నమాట".

** ** ** **

ఇంకా తెల్లవారలేదు.

బండి వస్తున్న సూచనగా ప్లాట్‌ఫారంపై బెల్ మోగిస్తుంటే నానీకి మెలుకువొచ్చేసింది.

ఉలికిపాటుగా లేచి కళ్ళు నులుముకుంటూ చుట్టూ చూశాడు.

రాత్రి ఖాళీగావున్న ప్లాట్ ఫాం ఇప్పుడు ప్రయాణికుల్తో కోలాహలంగా వుంది.

ఇంకా నిద్రపోతూనే వున్న తాతయ్యపై దుప్పటి సర్ది ఉత్సుకతగా ముందుకు నడవబోతుంటే హఠాత్తుగా రాజారావు గుర్తుకొచ్చాడు.

భయంతో ఓ స్థంభం చాటున నిలబడిపోయి కనుచూపు మేరదాక రెప్పవాల్చకుండా చూశాడు.

రాజారావు కనిపించలేదు. కాని చాలా దగ్గరగా పైజమా లాల్చీ వేసుకున్న గెడ్డం యువకుడు నిలబడి వున్నాడు.

తాతయ్య చెప్పిన గెడ్డం డాక్టర్ ఆయనే అయుంటాడన్న నమ్మకం ఏర్పడిపోవడంతో నెమ్మదిగా నడిచాడు ఆ యువకుడి దగ్గరకి.

"నమస్తే అంకుల్."

తల తిప్పిన ఆ యువకుడు తనను పలకరించిన నానీని తదేకంగా ఓ క్షణం చూసి"నమస్తే" అంటూ దగ్గరికి తీసుకుని "ఎవరు కావాలి బాబూ?" అన్నాడు ఎందుకు పలకరించింది అర్థంకాక.

"మీరే.... ఎందుకటే మీకు గెడ్డముందిగా.... తాతయ్య చెప్పాడు."

మృదువుగా నవ్వుతూ "ఏమని చెప్పారు?" అడిగాడు.

"మిమ్మల్ని కలిస్తే మందిస్తారని"

"ఏం మందు?"

"బ్రతికించే మందు."

మరింత విస్తుపోయిన ఆ యువకుడు నానీని బెంచీదాకా నడిపించి తీసుకెళ్ళాడు "నిన్న రాత్రి నుండి మీ కోసమే చూస్తున్నానంకుల్. రాత్రి మీర్రాలేదు" ఒడిలోకి తీసుకోగానే ఉత్సుకతతో కూర్చుని చెప్పాడు.

ఒక పేరున్న రచయితగా ఎన్నో సంఘటనలను సృష్టించిన మన్మధరావనబడే ఆ యువకుడిదో చిత్రమయిన అనుభవం.

"మీ తాతయ్యగారి పేరేమిటి?"

"నా పేరు నానీ. అయితే మా తాతగారి పేరు విశ్వేశ్వరశాస్త్రిగారు. మా ఊళ్ళో అందరు దేవుడంటారు. మరేమో నాకు వేదాలవీ నేర్పుతుంటారు. ఇప్పుడు పాపం ఆరోగ్యం బాగా లేదుగా, అందుకు మిమ్మల్ని కలిసి మందు పట్టుకురమ్మన్నారన్న మాట, అనకాపల్లికి ఏడో స్టేషనుగా ఇది. ఇక్కడ మీరుంటారు అన్నారు."

అందరూ దేవుడనే ఆయన ఎవరో మన్మథరావుకే తెలీదు. తన గెడ్డంచూసి పొరపాటు పడ్డాడు ఆ పసికందనీ కూడా అనిపించలేదు.

పేరూ, వూరూ తెలీని ఓ మనిషిని కేవలం గెడ్డం గుర్తుతో ఫలానా స్టేషనులో కలిసి ఆ మందు అదీ "బ్రతికించే మందు" గురిం చి అడగమన్నాడూ అనడంలో అనౌచిత్యం కన్నా ఒక మహా పండితుడు ఎదుగుతున్న తన వారసుడికి అస్పష్టంగా ఇచ్చిన సమస్యాపూరణంలా తోచింది అతనికి.

వచ్చేపోయేవాళ్ళ ఆరాటతో ఎటు చూసినా పరుగులు.

సరిగ్గా ప్రపంచానికి నిర్వచనం కూడా అదేనని తెలియని నానీ విభ్రమంగా చూస్తుంటే తను అడగాలనుకున్నది మరిచిన ఆ యువ రచయిత తను నిరీక్షించే వ్య క్తి కోసం పైకి లేచాడు ఆసక్తిగా.

అప్పుడు దిగింది ఫస్ట్‌క్లాస్ కంపార్టుమెంటులో నుంచి ఓ అందమైన యువతి.

ముగ్ధత్వాన్ని ఇప్పుడిప్పుడే దాటుతున్న ఆ యువతి అందమైన కనుదోయితో ఓ క్షణంపాటు మన్మథరావుని చూసి మరుక్షణం రాయంచలా ముందుకు సాగిపోయింది.

ఆమెను చేరుకోవాలనుకున్న అతడి పాదాలను ఏ సంకెళ్ళో బంధించి నట్టు ఆగిపోయాడు.

"మందిస్తావా అంకుల్" గుర్తు చేశాడు నానీ మరోమారు.

"నేను ఎదురు చూస్తున్నదీ ఆ మందుకోసమే" గొణిగాడు.

లాభంలేదు.... ఆమె వెళ్ళిపోతూంది....

మహల్లో బ్రతికే ఆమెను తన సందేశం అందించే అవకాశం చేజారిపోతూంది.

ఏ ఉద్దేశ్యంతో తను అక్కడకు వచ్చాడో అది నెరవేరక ముందే ఆమె కారెక్కి పోతూంది.

ఒక్క క్షణంపాటు ఆమెను సమీపించాలనుకున్నాడు కాని ఆమెను రిసీవ్ చేసుకోడానికి వచ్చిన నౌఖర్లనీ, కారు డ్రైవర్నీ చూసి ఆగిపోయాడు.

అప్పుడు మెరుపులా ఓ ఆలోచన వచ్చింది "నానీ ఓ పనిచేస్తావా"

"ఏంటంకుల్"

ఓ కవరు నానీ చేతికిచ్చాడు "ఇది నన్ను బ్రతికించే మందు దీన్ని ఆ కారెక్కుతున్న ఆంటీని చూశావా, ఆమె కందించాలి. అలా అయితే ఆ తర్వాత మీ తాతయ్యకి మందు నేను సంపాదిస్తాను"

పరుగెత్తబోతుంటే ఆపాడు "ఇక్కడే కాదు సగం దూరంలో" వివరంగా చెప్పాడు ఏం

చేయాల్సింది.

కారు కదలబోతుంటే పరుగెత్తుకుంటూ ఆమెను చేరిన నానీ "ఆంటీ నన్నూ మార్టూరుదాకా రానివ్వవూ" అన్నాడు అభ్యర్తిస్తున్నట్టుగా.

నౌఖర్లు నానీని ముందు నెట్టేయబోయారు కాని ఆమె వారించింది "రా కూర్చో"

కారు డోర్ తనే తెరిచింది.

ప్రారంభం సంతృప్తికరంగా జరిగిపోయినందుకు దూరంగా నిలబడ్డ మన్మధరావు ఆనందించాడు.

మరికొన్ని నిముషాలలో తెలిసిపోతుంది తన జీవితంలోని ఓ అమూల్యమైన మలుపుకి సంబంధించిన ఫలితం.

వెనుకగా తనూ రిక్షా ఎక్కాడు.

ఒక పరీక్షలో తలదూర్చి పరిచితుడైన ఒక మంచి మనిషికి సహకరించాలనుకున్న నానీకి తెలీదు కారెక్కుతుండగానే రాజారావు తనని చూశాడని.

నేరప్రవృత్తిలో బ్రతికే రాజారావుకి ఆ ప్రాంతం కొత్త కాదు.

కాబట్టే ఈసారి పరిచయమున్న మరికొందరు నేరస్థులతో చేతులు కలిపాడు.

** ** ** **

అంబాసిడర్ మార్టూరువేపు సాగిపోతూంది వేగంగా.

విండోలో నుంచి వెనక్కి పరుగెత్తుతున్న చెట్లను చూస్తుంటే తొలిసారి కారెక్కిన నానీకి చిత్రంగా వుంది.

ఒక పెద్ద జమీకి ఏకైక వారసురాలైన రతి నిశ్శబ్దంగా బయటికి చూస్తుంటే చాలా సేపటిదాకా ఆమెనే గమనిస్తూ వుండిపోయిన నానీకి చనువుగా మాట్లాడాలంటేనే భయం వేసింది.

నెమ్మదిగా పిలిచాడు "ఆంటీ"

తలతిప్పి చూసిన నానీ కవరందిస్తుంటే ముందు అదేంటో అర్థం కాక అడగబోయింది - కాని ఉత్తరం చివరలో మన్మధరావు పేరు చూసి ఆగిపోయింది-

"రతీ! నిన్ను ప్రియమైన అని ఎడ్రస్ చేయొచ్చో లేదో తెలీని స్థితిలో వున్న సామాన్యుడ్ని నేను. కాని ఏం చేయను.... చిన్నతనం నుంచీ నీతో గడిపిన క్షణాలు గుర్తుకొస్తుంటే 'గారూ' అంటూ మాత్రం సంబోధించలేకపోయాను.... నువ్వు అప్పటికి ఇప్పటికి మహల్లో కోకిలవయినా ఎలా మరిచిపోగలను - నీతో కలిసి ఆడుకున్న ముచ్చట్లనీ, నన్ను ప్రతి క్షణమూ ఆటపట్టించే నీ చిలిపి అల్లరిని.... గుర్తుందా... నేలపైనుంచి తాటి చెట్టును చూస్తేనే చాలు కళ్ళు తిరిగే నేను ఓ సారి తాటిచెట్టెక్కి కాయల్ని కోసి నువ్వడిగావని ముంజుల్నీ తీసిచ్చాను. కాలవలో మనం జంటగా వదిలిన కాగితపు పడవల్లో నీ పడవ నీటమునిగిందని నువ్వేడుస్తుంటే ఈతరాక రానివాడివి నీటిలో ఎందుకు దుమికావని నువ్వెన్ని నెలలు ఏడిపించావని. గుర్తుందా? మనల్ని

చూసి అమ్మేమనేదో.... కాకిలాంటి నాకు కోకిలవయిన నీకూ స్నేహమేమిట్రా అంటూంటే "పో అత్తయ్యా" అంటూ అప్పుడే వరుస కలిపేశావు.... ఆ తర్వాత ఆ ఒక్క పదం లాలిత్యంగా నా గుండెలపై ముద్రపడిపోతే జ్ఞానం తెలీని వయసైనా ఎన్ని నిద్రలేని రాత్రులు గడిపానో నీకేం తెలుసు.

ఒక్కరోజన్నా ఇద్దరం కలుసుకోలేకపోతే మరుసటిరోజు రాముడి కోవెల దగ్గర వెక్కి వెక్కి ఏడ్చేవాళ్లం.... ఎప్పుడూ ఎద్దేవా చేసే నిన్ను నిజంగా ఎప్పటికీ నాతో స్నేహం చేస్తూనే వుంటావా అని నేనోరోజు విస్మయంగా అడిగితే నువ్వేం చేసావో గుర్తుందా.... మామిడితోపులోని ఓ చెట్టు మొదలుపై 'రతీ మన్మధుల పెళ్లంట' అని చెరిగిపోని అక్షరాలు రాసేశావు.

వయసు పెరుగుతున్న నువ్వు రోజూ నాకు కనిపించటం లేదని ఉత్తరం రాస్తే ఆ ఉత్తరాన్ని చదిని నన్నెంత అభినందించావని.... రచయితవయిపోతావా అంటు ఎన్ని రోజులు ఆటపట్టించావు. ఉడుకుమోత్తనంతో నేరు నిజంగానే కథ రాస్తే అది ప్రచురింపబడినప్పుడు చాటుగా నువ్విచ్చిన బహుమతి నేను రాసిన ఎన్ని కథలకు స్ఫూ ర్తినిచ్చిందో నేను రచయితగా ఎన్నెన్ని మెట్లు అదిరోహించటానికి దోహదం చేసిందో నీకెలా చెప్పేది రతీ!

ఎక్కడున్నా నేనే నీ మనిషినన్నావు - ఎంత దూరంలో వున్నా నీ తలపునిండా నేనే అంటూ ఎన్నెన్ని జాబులు రాశావు.... అన్నింటి నన్ను ఆశ్చర్యపరిచింది నువ్వు ఓరియంటల్ కాలేజీలో చేరావని తెలిసినప్పుడు. నీకున్న సాహిత్య పిపాసే ప్రాచీన సాహిత్యం పై నీకున్న ఆసక్తే నిన్ను 'భాషా ప్రవీణ'ని చేసింది అంటే రచయితనయిన నేనూ ఎంత సంబరపడిపోయానో తెలుసా-

ఏంటో.... ఏదేదో రాసుకుపోతున్నాను కదూ-రతీ! ఉద్వేగాన్ని ఎలా ఆపుకోను- నీ ఆలోచనలు అశ్రువుల్లా నా కనుకొలనుల్లొ నిలిచి అల్లరి చేస్తుంటే వాటిని ఆనందభాష్పాలనుకోనా లేక మనల్ని దూరంగా నెట్టేసి ఆడుకునే అల్లరి అనుభూతుల తర్పణాలననా-

ఈ మధ్య ఆరునెలలుగా నిన్ను కలుసుకోవాలని ఎంత ప్రయత్నించానని.... వీలయితేగా- వచ్చే చనువుందేమోకాని నీ అంతస్తు చూసి రావాలంటే భయం - అమ్మ సైతం నిన్నెన్నిసార్లు గుర్తుంచుకుందో తెలుసా....

రతీ! నువ్వు దూరంగా వున్నా ఎప్పుడు దగ్గరే వున్న అనుభూతిని కలిగిస్తుంటే దగ్గరే ఉన్న అమ్మ త్వరలో దూరంకాబోతూ నన్ను నిస్సహాయుడ్ని చేస్తుంది - నీకు కబురందిందో లేదో కాని అమ్మకి కేన్సర్.... ఇంకెన్నాళ్ళో బ్రతకదంటున్నారు - అందుకే ఈ మధ్య నాగురించి మరీ ఆరాటపడిపోతూంది- నీకోసం క్షణం క్షణం తపించిపోతూంది- బహుశా "అత్తయ్యా" అన్న నీ గొంతు విని కన్ను మూయాలనుకుంటుందేమో....

ఇదెంటీ- చెప్పాలనుకున్నది చెప్పలేకపోతున్నానెందుకని.... రతీ! నేను స్థితిలో నీకు అనర్హుడ్నే అయినా నీ మనసులో చోటు చేసుకోగల అదృష్టవంతుడిగా అర్హుడ్నే అనుకుంటున్నాను. బహుశా అమ్మ కొరుకుంటున్నది అదేనేమో.... రతీ.... నేను దురాశపరుడ్నే

అనుకుంటే ఈ ఉత్తరాన్ని చించిపారేయ్.... కాదూ అనుకుంటే నన్ను అలరిపెట్టి ఆటపట్టించడానికనా ఒకసారి రా.... అమ్మ కోరిక కథఆ ముగుస్తుందో లేక నాభీష్ట కావ్యమై అమ్మని మరికొన్నాళ్ళు బ్రతికిస్తుందో అంతా నీ చేతులలో ఉంది. అతి చనువు తీసుకుంటే మన్నించు-

నీ ఉత్తరంకోసం దురాశగా ఎదురుచూసే

మన్మధ."

ఉత్తరం చదివి సాలోచనగా తల పైకెత్తి రతి "డ్రైవర్ కారాపు" అంది

నానీ విస్మయంగా చూస్తున్నాడు ఆమెనే.

ఆక్కడికి వూరు మరో కిలోమీటరు దూరముంది.

కొన్ని నిముషాలపాటు ఆలోచనల్లో మునిగిపోయింది తర్వాత వాలెట్ లోంచి పెన్ను తీసి ఆ ఉత్తరానికి వెనుకగా చకచకా రాసింది.

నానీని చూస్తూ "ఈ ఉత్తరాన్ని అంకుల్‌కిచ్చేయ్" అంది.

"నా కిల్లు తెలిదుగా" అమాయకంగా అన్నాడు.

నానీ ఎవరూ అన్న వివరాలు అడగలేదు "నేను ఊరిలోకి వెళ్లగానే చూపిస్తాను... సరేనా" అంది.